క్లుప్తంగా

అమ్మవార్లకు ఆషాఢం సారె



అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

మార్కాపురం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలువురు మహిళలు సోమవారం వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆలయాలకు వెళ్లి అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించారు. విజయ టాకీస్ సమీపంలోని నాగేంద్ర కనకదుర్గ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మహిళా భక్తురాలు దుర్గా సాగర్ ఆధ్వర్యంలో పోలేరమ్మ ఆలయం, శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం, సత్యనారాయణస్వామి ఆలయం, శివాలయాల్లో ఉన్న అమ్మవార్లకు సారె సమర్పించారు. కార్యక్రమంలో గుంటక వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

గృహాల పరిశీలన

కొమరోలు: మండలంలో నిర్మాణంలో ఉన్న గృహాలను డీఈ కదీర్‌బాషా, ఏఈ కృష్ణారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ మండలంలో 210 గృహాలకుగాను ఇప్పటి వరకు 59 పూర్తి చేసినట్లు తెలిపారు. శ్రావణ మాసంలో గృహప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మధ్యలోనే ఆగిపోయిన గృహాలు నిర్మించుకోవడానికి రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ రూ.50 వేలు ఏఎఫ్‌జే నగదు మంజూరు చేస్తోందని డీఈ చెప్పారు.

'కోట' మృతిపై సంతాపం

మార్కాపురం: బహుముఖ ప్రజ్ఞాశీలి, విభిన్న పాత్రలతో, తన విలక్షణ నటనతో ప్రేక్షకులను అలరించిన సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి కళారంగానికి తీరని లోటని త్రివిక్రమ అభ్యుదయ కళా సంఘం కార్యదర్శి చిత్తారి రంగనాయకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంఘ సభ్యులు పురాణం సుబ్రమణ్యం, ఆర్.వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసులు, ఎంవీ రమణ, డి.వెంకటేశ్వరరావు, ఎస్.రామకృష్ణారెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

మధ్యవర్తిత్వంతో మేలు



ర్యాలీలో పాల్గొన్న న్యాయవాదులు, విద్యార్థులు

మార్కాపురం: కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వంపై మార్కాపురం పట్టణ ప్రజలకు న్యాయవాదులు అవగాహన కల్పించారు. సోమవారం మార్కాపురంలోని జిల్లా కోర్టు ఆరో అదనపు న్యాయమూర్తి ఆదేశాల మేరకు మండల న్యాయసేవాధికార సంఘ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు హరికృష్ణ, ఎస్‌కే యూసఫ్ ఆలీ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చన్నారు. సమాజంలో శాంతి నెలకొనాలంటే అందరూ ఐకమత్యంతో ఉండాలని, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు.

టీబీ వ్యాధిపై అవగాహన

మార్కాపురం: మండలంలోని రాయవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. టీబీ యూనిట్ సిబ్బంది పి.గోవిందరాజులు, పి.లక్ష్మీరెడ్డి టీబీ వ్యాధి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నట్లయితే కళ్లె, రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం టి.రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ కుళాయిలు కట్

పొదిలి: పట్టణంలోని శ్రావణి ఎస్టేట్, దర్శి రోడ్డులోని పలు ప్రాంతాల్లో అక్రమ కుళాయి కనెక్షన్లను కమిషనర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నగర పంచాయతీ సిబ్బంది తొలగించారు. అక్రమ కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోవాలని పలు పర్యాయాలు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో తొలగిస్తున్నట్లు కమిషనర్ చెప్పారు. అక్రమ కుళాయిలు కలిగిన వారు డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

ఆటోను ఢీకొట్టిన మినీలారీ

- బేల్దారి కూలీలకు గాయాలు

పొదిలి: రోడ్డు ప్రమాదంలో బేల్దారి కూలీలు గాయపడిన సంఘటన సోమవారం పొదిలి నగర పంచాయతీ పరిధిలోని పోతవరం వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. కొనకనమిట్ల మండలం సిద్ధవరం నుంచి పొదిలికి ఆటోలో కూలీలు వస్తున్నారు. పోతవరం స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటోను ఎదురుగా వస్తున్న మినీ లారీ ఢీకొట్టింది. ఆటోలో ఉన్న రావినూతల సోమయ్యకు తీవ్రంగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పురుగు మందుల దుకాణాల తనిఖీ

పొదిలి: పట్టణంలోని విత్తన, ఎరువుల, పురుగు మందుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. మంగళగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు టి.శ్రీనివాసులు, విజిలెన్స్ సీఐ ఎస్‌కే సుభానీ తనిఖీల్లో పాల్గొన్నారు. రికార్డులు, స్టాకును పరిశీలించారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, నకిలీ సరుకు అంటగడితే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని స్పష్టం చేశారు. దుకాణాల్లో మరిన్ని నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించాలని ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డికి సూచించారు.

సర్కారు దయ.. విద్యార్థుల ప్రాప్తం!



కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల



డ్రమ్ములో ఉంచిన బోరు నీళ్లు తాగుతున్న విద్యార్థులు

- కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి మోక్షమెప్పుడో?
- గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కింద రూ.47.98 లక్షలు మంజూరు
- ఏడాదిగా నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు
- పని చేయని ఆర్వో ప్లాంట్.. డ్రమ్ముల్లో నింపిన బోరు నీరే దిక్కు
- ఉర్దూ మీడియంలో ఆరుగురు ఉపాధ్యాయులకుగాను అందుబాటులో ఉంది ఒక్కరే..
- మినీ స్టేడియం అభివృద్ధిపై దృష్టి సారించని అధికారులు

కంభం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కింద చేపట్టిన పనులకు సైతం బ్రేకులు పడటంతో పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. వివరాల్లోకి వెళ్తే.. కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 450 మందికి పైగా విద్యార్థులు ఉండగా వారికి సరిపడా తరగతి గదులు, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో అవస్థల నడుమ చదువు కొనసాగిస్తున్నారు. పాఠశాలలో 18 తరగతులు ఉండగా అందులోనే తరగతి గదులు, స్టోర్‌రూము, స్పోర్ట్స్ రూము, ఎన్‌సీసీ రూము, ప్రధానోపాధ్యాయుడి గది, విద్యార్థుల తరగతి గదులుగా వినియోగించుకుంటున్నారు. పాఠశాలలో విద్యార్థులను 3 సెక్షన్లుగా విభజించగా వారికి ఇంకా 12 అదనపు తరగతి గదులు అవసరమవుతాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

నిలిచిన అదనపు గదుల నిర్మాణం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కార్యక్రమం కింద కంభం జెడ్పీ హైస్కూల్‌కు రూ.47.98 లక్షలు మంజూరు చేసింది. నాలుగు అదనపు గదుల నిర్మాణం శ్లాబు దశ వరకు పూర్తి కాగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ గదులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

పనిచేయని ఆర్వో ప్లాంట్

పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యార్థులకు మినరల్ వాటర్ అందించేలా ఏర్పాటు చేశారు. గత కొన్ని నెలలుగా ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు డ్రమ్ములో నింపిన బోరు నీటిని తాగుతున్నారు. త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో వాటర్ ప్లాంట్ తరచూ మరమ్మతులకు గురవుతున్నట్లు తెలుస్తోంది.

ఉర్దూ బోధకులు కరువు

ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంతోపాటు ఉర్దూ మీడియం విద్యార్థులు ఉన్నారు. జిల్లాలో ఉర్దూ మీడియం బోధించే ఒకే ఒక హైస్కూల్ కంభంలోనే ఉంది. ఇటీవల చేపట్టిన బదిలీలు, ప్రమోషన్లలో ఇక్కడ పనిచేస్తున్న ఉర్దూ టీచర్లంతా వెళ్లిపోయారు. ప్రస్తుతం పాఠశాలలో ఉర్దూ బోధకుడు ఒకరే ఉండగా, ఇదే మీడియంలో గణితం, సోషల్, బయాలజీ, ఫిజికల్ సైన్స్ బోధించే వారు లేరు.

అభివృద్ధికి నోచుకోని క్రీడా మైదానం

మార్కాపురం డివిజన్‌లోనే అతి పెద్దదైన కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధికి నోచుకోవడంలేదు. పాఠశాల మైదానాన్ని మినీ స్టేడియంగా మారుస్తామని చెప్పిన ప్రజాప్రతినిధుల మాటలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయి. జాతీయ క్రీడా విధానం–2025లో మైదానాలను అభివృద్ధి చేసే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా ప్రయత్నించడం లేదన్న విమర్శలొస్తున్నాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ద్వారా మార్కాపురంలో సబ్ సెంటర్ ఏర్పాటు చేసి విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇస్తుండగా, విశాలమైన మైదానం ఉన్న కంభంలోనూ సబ్‌సెంటర్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మైదానంలో ఓ వైపు 20 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న భవనంలో జిమ్ ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు, విద్యార్థులు, వాకర్స్ కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రమోషన్లు, బదిలీల్లో భాగంగా ఇక్కడ ఉన్న ఉర్దూ ఉపాధ్యాయులు వెళ్లిపోయారు. ఖాళీలకు సంబంధించిన వివరాలను విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పై అధికారుల నుంచి అనుమతులొస్తే నిలిచిపోయిన అదనపు గదుల నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. మైదానం అభివృద్ధి కోసం కృషి చేస్తా.

– అబ్దుల్ సత్తార్, ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ–1

ఉర్దూ బోధకుల ఖాళీలు భర్తీ చేయాలి



విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉర్దూ సబ్జెక్టు ఉపాధ్యాయుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. ఉపాధ్యాయులు లేకుండా పిల్లలను ఉర్దూ మీడియంలో చేర్పించాలంటే తల్లిదండ్రులు ఇష్టపడరు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– సయ్యద్ ఖాసిం, ఉపసర్పంచ్, కంభం



పని చేయని ఆర్వో ప్లాంట్



నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం



విశాలమైన క్రీడా మైదానం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో నూతనంగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో కొమరోలు సబ్‌స్టేషన్ పరిధిలోని కొమరోలు, చింతలపల్లి, సూరవారిపల్లి గ్రామ పంచాయతీల్లో మంగళవారం ఉదయం 8.30 నుంచి ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని రాజుపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని ముక్తాపురం అగ్రికల్చరల్ ఫీడర్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై ప్రభాకరరెడ్డి

కొనకనమిట్ల: విద్యార్థులు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రభాకరరెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం టి.ఆదినారాయణ పర్యవేక్షణలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. విద్యార్థి దశలో ఎలా నడుచుకోవాలి, పెడదోవ పడితే ఎదుర్కొనే ఇబ్బందుల గురించి వివరించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సప్ లాంటి సామాజిక మాధ్యమాల్లో గుర్తు తెలియని వ్యక్తులు పంపే వెబ్ లింక్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. మొబైల్ ఫోన్ ఎంతగా ఉపయోగపడుతుందో అంతే స్థాయిలో చెడు కూడా చేస్తుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన కల్పించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, అనుమానాస్పదంగా సంచరిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని బాలికలకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్‌లో అదనపు దోపిడీ!



ఆర్వో ప్లాంట్ వద్ద రూ.10 కాయిన్ వేసి నీరు పట్టుకుంటున్న స్థానికుడు

కంభం: మండలంలోని పెద్ద నల్లకాల్వ గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌లో గత మూడు నెలల నుంచి 20 లీటర్ల నీటికి రూ.10 వసూలు చేస్తున్నా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. పెద్దనల్లకాల్వ పంచాయతీ పరిధిలో సుమారు 13 సంవత్సరాల క్రితం ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేసి గ్రామస్తులకు తక్కువ ధరకు మినరల్ వాటర్ అందిస్తున్నారు. మూడు నెలల క్రితం వరకు స్థానికులు రూ.5 కాయిన్‌ను వెండింగ్ మెషీన్‌లో వేసి నీరు పట్టుకునేవారు. కానీ ఇప్పుడు రూ.10 కాయిన్ వేస్తేనే నీరు వస్తున్నాయి. రూ.5 అదనంగా వసూలు చేస్తున్న విషయం పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీఓ విజయలక్ష్మిని వివరణ కోరగా.. విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఐఆర్ ప్రకటించి పీఆర్‌సీ కమిటీ వేయాలి

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య

తర్లుపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా పీఆర్సీ కమిటీ వేయకుండా కాలయాపన చేస్తోందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎర్రయ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం తర్లుపాడు మండలంలోని సీతానాగులవరం, తర్లుపాడు, గొల్లపల్లి, రోలుగుంపాడు, తాడివారిపల్లి, నాగెళ్లముడుపు, చెన్నారెడ్డిపల్లి గ్రామాల్లో పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించి వెంటనే పీఆర్సీ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయులకు వెబ్‌ఎక్స్ మీటింగులు తగ్గించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ త్వరగా ఇవ్వాలన్నారు. 2003 డీఎస్సీ అభ్యర్థులకు పాత పెన్షన్ స్కీమ్ వర్తింపజేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, హైస్కూళ్లలో స్టడీ అవర్స్ డిసెంబర్ నుంచి అమలు చేయాలన్నారు. విద్యార్థుల హాజరు నమోదు సమయాన్ని 10.30 గంటల వరకు పొడిగించాలని, పదోన్నతుల సీనియారిటీని మెరిట్ ప్రాతిపదికన తయారు చేయాలని, సబ్జెక్టు కాంప్లెక్సును 2 మండలాలకు కలిపి నిర్వహించాలన్నారు. ఆయన వెంట మండల శాఖ అధ్యక్షుడు జగన్‌బాబు, ప్రధాన కార్యదర్శి నజీర్ అహ్మద్, కార్యదర్శి అంజనీకుమార్ ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మార్కాపురంలో కార్మికుల నిరసన



గిద్దలూరులో సమ్మె చేస్తున్న కార్మికులు

మార్కాపురం టౌన్: మున్సిపల్ కార్యాలయాల్లో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె సోమవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ నంబర్ 36 అమలు చేయాలని, వేతనం రూ.21 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సుబ్బరాయుడు, హరి, నాయకులు కృష్ణ, చెన్నయ్య, శేఖర్, రషీద్ బాషా, యూసఫ్, గురునాథం, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై మున్సిపల్ కార్మికుల నిరసన

గిద్దలూరు రూరల్: ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులకు జీఓ 36 ప్రకారం వేతనం చెల్లించాలని, రిటైరైన కార్మికుల పిల్లలకు ఉద్యోగం కల్పించాలని, వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు మస్తాన్‌రెడ్డి, సలీమ్, రహ్మతుల్లా, పుల్లయ్య, నాగయ్య, రంగస్వామి, శ్రీరాములు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గిద్దలూరు రూరల్: కుటుంబ కలహాల కారణంగా పట్టణంలోని గణేష్ నగర్‌లో ఓ వివాహిత సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. యగటీల లక్ష్మీప్రశాంతి ఆమె అత్త, ఆడబిడ్డల వేధింపులు తాళలేక నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు భర్త రంగనాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆస్తి విషయంలో తలెత్తిన వివాదం కారణంగా లక్ష్మీప్రశాంతి నిద్రమాత్రలు మింగడంతో అపస్మారక స్థితిలోకి జారుకుంది. ఆమెను చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేష్ తెలిపారు.

మృతుల కుటుంబాలకు 'అన్నా' పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అన్నా రాంబాబు

మార్కాపురం: మార్కాపురం మండలం మిట్టమీదిపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు వ్యక్తుల కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సోమవారం స్థానిక జీజీహెచ్‌లో పరామర్శించారు. కారు, బైకు ఢీకొన్న సంఘటనలో అర్ధవీడు మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఆకవీటి విజయ్, బొల్లుపల్లి గ్రామానికి చెందిన దావీదు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక జీజీహెచ్‌కు తరలించగా వారి కుటుంబ సభ్యులు కూడా అక్కడికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న అన్నా రాంబాబు జీజీహెచ్‌లో బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.


గిద్దలూరులో మొక్కుబడిగా గ్రీవెన్స్



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

గిద్దలూరు రూరల్: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే మీ కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్‌ఎస్) కార్యక్రమం మొక్కుబడి తంతుగా మారిపోయింది. అన్ని శాఖల అధికారులు ఒకే చోట ఉండి ప్రజల ఫిర్యాదులను పరిష్కరించాల్సి ఉండగా కొన్ని శాఖల అధికారులు తరచూ డుమ్మా కొడుతున్నారు. సోమవారం వ్యవసాయశాఖ, హౌసింగ్, సాంఘిక సంక్షేమశాఖ, ఎంపీడీఓ కార్యాలయ అధికారులు మాత్రమే హాజరయ్యారు. సర్వర్ పనిచేయకపోవడంతో కలెక్టర్ నిర్వహించే టెలీ కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి పాల్గొనలేకపోయారు. రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పాదలకుంటపల్లె గ్రామానికి చెందిన తల్లీకుమారుడు మర్రి పుల్లమ్మ, రంగస్వామి తమ అనుభవంలో ఉన్న పొలాన్ని ఇతరుల పేరు మీదకు మార్చుకున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ పనుల పరిశీలన



తుమ్మలచెరువు సచివాలయంలో కేంద్ర బృందం సభ్యులు

తర్లుపాడు: మండలంలోని చెన్నారెడ్డిపల్లి, తుమ్మలచెరువు గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్–2025 కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను కేంద్ర బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. పారిశుధ్యం, మురుగునీటి నిర్వహణ, తడిచెత్త, పొడిచెత్త నిర్వహణ, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు, మరుగుదొడ్ల వినియోగంపై గ్రామస్తులను ఆరా తీశారు. కేంద్ర బృందం అధికారులు రవివర్మ, సందీప్, ఖాజావలి, రవీంద్ర వెంట సర్పంచ్ షాజహాన్, ఈఓఆర్‌డీ టి.సుకుమార్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పైపుల లీకేజీతో నీరు వృథా



వృథాగా పోతున్న నీరు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పలు వీధుల్లో కుళాయి పైపుల లీకేజీ కారణంగా నీరు నిత్యం వృథాగా పోతోంది. స్థానిక విశ్వభారతి స్కూల్ వద్ద డ్రైనేజీలో ఉన్న పైప్‌కు భారీ లీకేజీ ఏర్పడటంతో నీరంతా పైకి ఎగజిమ్ముతోంది. లీకేజీల కారణంగా తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఏఈ పార్థియాను వివరణ కోరగా.. లీకేజీకి మరమ్మతులు చేస్తున్నామని, నీరు వృథా కాకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

వాల్మీకి సంఘ ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు

మార్కాపురం: వాల్మీకి సంఘ జిల్లా జనరల్ సెక్రటరీగా మార్కాపురం మండలం గొట్టిపడియ గ్రామానికి చెందిన మండ్ల ఆంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర జనరల్ సెక్రటరీ క్రాంతి ఉత్తర్వులు ఇచ్చినట్లు సోమవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో బోయ, వాల్మీకి సామాజికవర్గ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆంజనేయులు పేర్కొన్నారు.